క్లుప్తంగా

ఎస్సైగా బాధ్యతల స్వీకరణ



ఏటూరునాగారం: ఏటూరునాగారం ఎస్సైగా శ్రావణ్ కుమార్ ఆదివారం బాధ్యతలను చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న గుర్రం కృష్ణ ప్రసాద్ మెడికల్ లీవ్‌పై వెళ్లటంతో ఆయన స్థానంలో తాడ్వాయి 2 ఎస్సై శ్రావణ్ కుమార్‌ను ఏటూరునాగారం ఎస్సైగా నియమించారు. కాగా ఆదివారం ఆయన బాధ్యతలను చేపట్టారు.

హనుమాన్ ఆలయంలో చోరీ

మహాముత్తారం: మండలంలోని బోర్లగూడెం హనుమాన్ దేవాలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆదివారం ఉదయం ఆలయ ఆవరణం శుభ్రం చేయడానికి మహిళ వచ్చేసరికి తలుపులు తెరిచి ఉండటంతో దేవాలయ కమిటీ చైర్మన్‌కు సమాచారం అందించింది. దీంతో చైర్మన్‌తో పాటు పలువురు ఆలయానికి చేరుకొని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని చోరీ జరిగిన తీరును పరిశీలించి ఫింగర్ ప్రింట్ సేకరించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

మొగుళ్లపల్లి: మండలంలోని రైతులకు జీలుగ విత్తనాలు మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రంలో సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి సురేందర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల రైతులు పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీ, తీసుకోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఒక బస్తా సంచి 30 కిలోలు ఉంటుందని రూ.843 చెల్లించాలన్నారు.

గీత కార్మికుడిని కాపాడిన తోటి కార్మికులు



చిట్యాల: మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గోపగాని రవి తన వృత్తిలో భాగంగా ఆదివారం తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవశాత్తు అతడి కాలుకు ఉన్న గుయ్యి జారి చెట్టు మధ్యలోనే ఉన్నాడు. దీంతో తోటి గీత కార్మికులు గోపగాని సాంబయ్య, అరెల్లి రాజు గమనించి చెట్టు ఎక్కి ప్రమాదంలో ఉన్న రవి ప్రాణాలను కాపాడారు. రవి ప్రాణాలను కాపాడిన సాంబయ్య, రాజులను గ్రామస్తులు అభినందించారు.

పనుల పరిశీలన



పలిమెల: మండలంలోని పలిమెల, పంకెన, లెంకలగడ్డ గ్రామాల్లో స్పెషల్ శానిటేషన్‌లో భాగంగా చేపట్టిన పనులను ఎంపీడీఓ ప్రకాశ్ రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలను సందర్శించి మొక్కల పెంపకం , కలుపు నివారణపై సిబ్బందికి సూచనలు చేశారు. సామూహిక ఇంకుడు గుంతలకు మార్కింగ్ చేయించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు శ్రీధర్, సల్మాన్, ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, సిబ్బంది తదితురులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



మల్హర్: మండలంలోని తాడిచర్లలో ఏర్పాటు చేసిన బొడ్రాయిని జెడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్ ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం కమిటీ సభ్యులు ఆమెకు జ్ఞాపికను అందజేసి శాలువాతో సత్కరించారు. ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, పీఏసీఎస్ చైర్మన్ మల్కా సూర్య ప్రకాష్‌రావు, కోట రవి, ఆర్ని సత్యనారయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల సమ్మేళనం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని రంగయ్యపల్లి ఉన్నత పాఠశాలలో 2002–03 విద్యా సంవత్సరం పదవ తరగతి విద్యార్థులు పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యాబుద్దులు నేర్పిన ఉపాధ్యాయులకు శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అధ్వానంగా జీసీసీ సేల్స్ డిపో!

- ప్రజల బియ్యం పందికొక్కుల పాలు
- పట్టించుకోని అధికారులు



సేల్స్‌డిపోలో కిందపడి ఉన్న బియ్యం

ఏటూరునాగారం: జీసీసీ ద్వారా మహిళా సంఘానికి కేటాయించిన సేల్స్‌డిపో భవనం లోపట పెద్ద పెద్ద గోతులు ఏర్పడి పందికొక్కులు, ఎలకలకు నివాసంగా మారింది. ప్రజలకు అందాల్సిన బియ్యాన్ని నిల్వ చేసి ఉంచగా ఎలకలు, పందికొక్కులకు ఆహారంగా మారింది. ఈ విషయాన్ని జీసీసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకుకోడం లేదని పలువురు వాపోతున్నారు. ఏటూరునాగారం ఐటీడీఏకు కూతవేటు దూరంలో మండల కేంద్రం పరిధిలోని తాళ్లగడ్డ సమీపంలో జీసీసీ సేల్స్‌డిపో ఉంది. సుమారు 450 కార్డుదారులున్న ఈసేల్స్ డిపో భవనానికి కనీసం విద్యుత్ సరఫరాలేదు. దీంతో బియ్యం ఇచ్చేందుకు ఉపయోగించే ఎలక్ట్రానిక్ బయోమెట్రిక్ మిషన్‌కు చార్జింగ్ పెట్టుకునేందు పరిస్థితి లేదు. చార్జింగ్ కోసం పక్కనే ఉన్న ఇళ్లలోకి వెళ్లి వారిని పెట్టుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఇలా రెండేళ్లుగా సాగుతున్నా జీసీసీ అధికారులు మాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవు. ఐటీడీఏ ఇంజనీరింగ్‌శాఖ ద్వారా 7 సంవత్సరాల క్రితం ఈ జీసీసీ సేల్స్‌డిపోలను నిర్మించారు. అప్పటి కాంట్రాక్టర్ బిల్లులు డ్రా చేసుకున్నాడు కానీ ఎలాంటి సౌకర్యం కల్పించలేదు. కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్‌సరఫరా, ఫ్యాన్లు ఇలాంటివి ఏమిలేకుండా నిర్మించి డబ్బులు డ్రా చేసుకొని చేతులు దులుపుకున్నారు. అప్పటి ఇంజనీరింగ్ అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి బిల్లును చేసి ఇచ్చారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఇంజనీరింగ్ అధికారులు, జీసీసీ అధికారులు స్పందించి ప్రజలకు అందాల్సిన ప్రజాపంపిణీ బియ్యం పందికొక్కుల పాలు కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



పందికొక్కులు తవ్విన మట్టి

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం



పరామర్శిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి

ఎస్ఎస్ తాడ్వాయి: బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని జెడ్పీ వైస్ చైర్ పర్సన్ బడే నాగజ్యోతి అన్నారు. మండలంలోని కాల్వపల్లి గ్రామంలో శనివారం రాత్రి గాలి బీభత్సానికి చెట్లు విరిగిపడి 15 ఇళ్లపై కప్పులు దెబ్బతిన్నాయి. దీంతో బడే నాగజ్యోతి గ్రామంలోని బాధిత కుటుంబాలకు ఆదివారం పరామర్శించి భరోసా 0కల్పించి నష్ట తీవ్రతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గాలివాన బీభత్సం వల్ల నష్టపోయిన బాధితులకు ప్రభుత్వం తప్పకుండా నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. మరో రెండు, మూడు రోజుల పాటు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆమె వెంట సర్పంచ్ సంపత్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు పీరీల నరేష్,నాయకులు పెండ్లి సంపత్, కొప్పుల కార్తీక్, సంపత్, అమరేందర్, చలమయ్య, నాగమణి ఉన్నారు.

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

ములుగు రూరల్(గోవింద్‌నాయక్): మండలంలోని చల్వాయి గ్రామానికి చెందిన బొల్లం సుశీల, మల్యాల శివ, గోరెపాటి వెంకటేశ్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను ఎంపీపీ సూడి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం పరామర్శించి బియ్యం అందజేశారు. ఆయన వెంట మండల ప్రధాన కార్యదర్శి నర్సింహనాయక్, పృద్వీరాజ్, ఈసం సమ్మయ్య, మధు, పూర్ణచందర్, గట్టయ్య, శ్రీనివాస్, భద్రయ్య, సురేష్, సంతోష్, వెంకటేశ్వర్లు, కనకయ్య, వెంకట్‌రావు, రఘు ఉన్నారు.

'చేయూత' ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



సర్టిఫికెట్లు అందజేస్తున్న చంద్రమౌళి

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బీసీ మద్రిగూడెం పంచాయతీ నేలారిపేట గ్రామంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని వెంకటాపురం అటవీశాఖ అధికారి చంద్రమౌళి ప్రారంభించారు. కాగా 16 మంది పాల్గొని రక్తదానం చేయగా వారికి రెడ్ క్రాస్ సొసైటీ నుంచి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్, దిశ ఫౌడేషన్ అధ్యక్షురాలు మాధురి, పంచాయతీ కార్యదర్శి సురేష్, చిడెం ముత్తయ్య, కొప్పుల వినోద్, గుండమల్ల మధు తదితరులు ఉన్నారు.

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



ములుగు: రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సీతక్క



ఏటూరునాగారంలో..

ములుగు: దేశానికి రాజీవ్‌గాంధీ అందించిన సేవలు మరువలేనివని ఏఐసీసీ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే డాక్టర్ ధనసరి సీతక్క అన్నారు. ఆదివారం తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఐటీ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చి దేశానికి దిశానిర్దేశం చేసిన మహనీయుడు అన్నారు. కంప్యూటర్ రంగాన్ని దేశానికి తీసుకవచ్చి, విద్యార్థులు సాంకేతిక విద్యను నేర్చుకునేలా చేశారని గుర్తుచేశారు. ఆఖరి రక్తపుబొట్టు వరకు దేశ అభివృద్ధికి కృషి చేసి ప్రాణాలు కోల్పోయిన గొప్పవ్యక్తి రాజీవ్‌గాంధీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ గొల్లపల్లి రాజేందర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోత్ రవిచందర్, మత్స్యకార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు కంబాల రవి, మండల అధ్యక్షుడు ఎండీ చాంద్‌పాషా, వర్కింగ్ ప్రెసిడెంట్ నల్లెల భరత్, కిసాన్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి గుంటోజు శంకరయ్య, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్‌యాదవ్, పట్టణ అధ్యక్షుడు వంగ రవియాదవ్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి, కుక్కల నాగరాజు, బండి మధు, వంశీ కృష్ణ, ఎల్లావుల అశోక్, ఓరుగంటి అనిల్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చిటమట రఘు, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింహారావు, ఎల్లయ్య, ఎంపీటీసీ గుడ్ల శ్రీలత, దేవేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



ఎస్ఎస్ తాడ్వాయి: గిరిజనులతో అరుణ్‌కుమార్

ఎస్ఎస్ తాడ్వాయి: మండలంలోని అటవీ ప్రాంతంలోని గిరిజన గ్రామాల్లోని ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని అటవీ గ్రామాలైన కోశాపూర్, అల్లిగూడెం, బందాల, నర్సాపూర్, బొల్లెపెల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంవత్సరాల నుంచి గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం లేక వర్షాకాలంలో బయటి ప్రపంచంతో సంబంధాలు లేకుండా పోతున్నాయని, విద్య, వైద్య పరంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయని కనీసం రోడ్ల అభివృద్ధిపై అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర అటవీశాఖ అనుమతులు మంజూరైన క్రమంలో జిల్లా అధికారులు త్వరిగతిన రహదారులు పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆలం అశోక్, నాయకులు సారయ్య, ఎట్టి ప్రకాశ్ పాల్గొన్నారు.

ఏటూరునాగారం: చింతల మొర్రిగొత్తికోయ ఆదివాసీ గూడెం సమస్యలను అధికారులు పరిష్కరించాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మైపతి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆదివాసీ గ్రామాన్ని తుడుందెబ్బ బృందం సందర్శించి గ్రామంలోని సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సరైన రహదారి సౌకర్యం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

మొబైల్ అప్పగింత



రాంబాబుకు ఫోన్ అందజేస్తున్న సీఐ

వాజేడు: మండల పరిధిలోని ధర్మవరం గ్రామానికి చెందిన గార రాంబాబు సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈ మేరకు పేరూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా పోలీసులు సెల్‌ఫోన్ దొరకబట్టారు. దానిని ఆదివారం వెంకటాపురం(కె) సీఐ కాగితోజు శివప్రసాద్ చేతుల మీదుగా గార రాంబాబుకు పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. సీఐ వెంట పేరూరు ఎస్సై హరీష్ ఉన్నారు.

నష్టపరిహారం చెల్లించాలి



పరామర్శిస్తున్న సీపీఎం నాయకులు

ములుగు రూరల్: గాలి దుమారం కారణంగా ఇళ్లు ధ్వంసమైన కుటుంబాకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని పస్రాలో గాలి దుమారం కారణంగా చెట్లు ఇళ్లపై పడి ధ్వంసమైన కుటుంబాన్ని ఆయన పరామర్శించి మాట్లాడారు. మండలంలో కోటగడ్డ, పాపయ్యపల్లి, మొద్దులగూడెం గ్రామాలలో గాలిదుమారం కారణంగా పలు ఇళ్ల పైకప్పులు లేచి పోయాయని అన్నారు. బాధితులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని అన్నారు. రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ప్రభుత్వానికి నివేదికలు అందించాలని అన్నారు. ఇళ్లతో పాటు మామిడి తోటలు, వరి పంటలు పూర్తిగా నష్టం వాటిల్లిందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేయాలని అన్నారు. కోటగడ్డ గ్రామంలో నిన్నటి నుంచి విద్యుత్ అంతరాయం ఏర్పడిందని విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పొదిల్ల చిట్టిబాబు, గొంది రాజేష్, అంబాల పోషాలు, చంద్రారెడ్డి, రవీందర్‌రెడ్డి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం: మండల పరిధిలోని గోగుపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సొసైటీ అధ్యక్షుడు కూనూరి అశోక్ ఎంపీపీ తుమ్మల సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. వంగపండ్ల రవి, వట్టం అమృత, మహేష్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న భద్రయ్య

వెంకటాపురం(ఎం): మండలంలోని నారాయణపూర్‌కు చెందిన ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు సందబాబు తల్లి ఇటీవల మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మొగుళ్ల భద్రయ్య ఆదివారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. మృతురాలి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఏలకంటి రాజు, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ నాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, జిల్లా సంయుక్త కార్యదర్శి అక్కపెళ్లి అరవింద్, మండల అధ్యక్షులు బొచ్చు రాజేందర్ పాల్గొన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై అశోక్

వాజేడు: అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై రేఖఅశోక్ అన్నారు. మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అశోక్ గ్రామస్తులతో మాట్లాడుతూ.. చదువు వలన కలిగే ప్రాముఖ్యతను వివరించారు. బాల్య వివాహాలను చేయడం మూలంగా కలిగే నష్టాలను వివరించారు. 14 సవత్సరాల వయస్సు లోపు వారందరిని బడిలో చేర్పించాలని సూచించారు. యువత గజాయి, పేకాట, కోడి పందేలకు బానిసకాకూడదని అలా చేస్తే చట్టపరంగా కఠిన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. ఫోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. గ్రామంలోకి అపరిచితులు వస్తే 87126 70096, 87126 70097 ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్సై సూచించారు.

అధైర్య పడకండి.. ఆదుకుంటాం



ధ్వంసమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గండ్ర

టేకుమట్ల(రేగొండ): వర్షానికి ఇళ్లు ధ్వంసమైన బాధితులకు అధైర్య పడకుండి ఆదుకుంటామని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి భరోసా కల్పించారు. ఆదివారం రేగొండ మండలంలోని దామరంచపల్లిలో పర్యటించి అకాల వర్షానికి ఇళ్లు ధ్వంసమైన బాధితులను పరామర్శించి, భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇళ్లు ధ్వంమసమైన వారితో పాటు, పంట నష్టరైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని అన్నారు. అలాగే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి రేగొండ మండలంలో జరిగిన పంట నష్టాన్ని వ్యవసాయాధికారులచే అంచనా వేపించాలని కోరారు. రైతులు ఎవరూ ఆందోళన చెందరాదని, ప్రభుత్వం నుంచి తప్పకుండా పరిహారం అందేలా కృషి చేస్తానన్నారు. ఆయన వెంట పున్నం రవి, సామల పాపిరెడ్డి, వవి స్మార్ట్, మైస భిక్షపతి, అంకం రాజేందర్, తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న సభ్యులు

చిట్యాల: మండలంలోని శాంతినగర్ గ్రామంలో శనివారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు దగ్ధం అయ్యాయి. కాగా ఈ సంఘటనలో దానవేని తిరుపతి ఇళ్లు పూర్తిగా కాలిపోవడంతో అతడి కుటుంబాన్ని చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో శనివారం రూ.35వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు అబ్బెంగుల రాజయ్య, బుట్టి ఉపేందర్, కొప్పుల కుమార్, జెట్టి తిరుపతి, దానవేని కోమురయ్య, అశోక్, నరేష్, ఓదేలు, సమ్మయ్య, అయిలయ్య తదితరులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



కాలిపోయిన గుడిసె

మల్హర్: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మండలంలోని నాచారం గ్రామానికి చెందిన కాలవేని సమ్మయ్య గుడిసె ఆదివారం దగ్ధమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సమ్మయ్య కుటుంబ సభ్యులు పొలం పనుల నిమిత్తం ఉదయం బయటకు వెళ్లారు. తిరిగి వచ్చే సరిగా ఇంటి నుంచి పొగలు రావడంతో గమనించి స్థానికుల సాయంతో నీళ్ల చల్లారించే ప్రయద్నం చేసిన మంటలు వ్యాప్తి చెంది గుడిసె పూర్తిగా దగ్ధమైంది. దీంతో ఇంట్లోని గృహోపకరణలు కాలిపోయాయి. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని సమ్మయ్య కోరాడు.